క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట మెయిన్ రోడ్డు, బాలసముద్రం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, విద్యారణ్యపురి, విజయగణపతి నగర్, మహాత్మానగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, కాజీపేట దర్గా, పోచమ్మ గుడి, హౌజింగ్ బోర్డు కాలనీ, బియాబాని నగర్, గాంధీనగర్, బీజేపీ క్వార్టర్స్ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు, ములుగు క్రాస్ రోడ్డు, ప్రభుత్వ ఐటీఐ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. పెరుకవాడ, ఎస్ఆర్ఆర్ తోట, రైల్వే అండర్ బ్రిడ్జి, పాపయ్యపేట చమన్, మట్టెవాడ, ఎల్లంబజార్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, నక్కలపెల్లి, రాంగోపాల్ పూర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని హసన్‌పర్తి, పెంబర్తి ఫీడర్ ప్రాంతాల్లో శుక్ర, శనివారాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శిరీష్ తెలిపారు. ఉదయం 6నుంచి 11గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు మహాత్మా జ్యోతిబాపూలే జయంతి

కాజీపేట అర్బన్: మహాత్మా జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలను ములుగు రోడ్డులోని పూలే విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నిర్వహించనున్నట్లు బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జయంతి వేడుకలకు ముఖ్యఅతిథులుగా మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

షీట్‌మెటల్ వేర్ కళాకారుల ఎన్నిక

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని షీట్ మెటల్ వేర్ కళాకారుల పొదుపు పరపతి, పారిశ్రామిక పరస్పర, సహాయక సహకార సంఘం భవనంలో సంఘం ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షుడిగా మట్టెవాడ ప్రణయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా దేవులపల్లి రజిత, ఉపాధ్యక్షురాలిగా రాగి అరుణ, సహాయ కార్యదర్శిగా రాగి మాధవి, కోశాధికారిగా మట్టెవాడ రమేష్, సహాయ కోశాధికారిగా బొల్లెపల్లి సరిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పరిశోధకురాలు స్వప్నకు డాక్టరేట్




కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో ఫార్మసీ విభాగంలో పరిశోధకురాలైన హనుమకొండకు చెందిన కందగట్ల స్వప్నకు ఆ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. తెలంగాణ గిరిజన ప్రాంతాల ఎథ్నోమెడిసిన్లను ప్రమాణీకరించి వాటినుంచి ఉపయోగకరమైన ఔషధాలను వెలికితీయడం అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ యూనివర్సిటీలోని ఫార్మసీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సృజన, కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి సహ పర్యవేక్షణలో స్వప్న తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

పేటెంట్ కూడా లభించింది

స్వప్న తన పరిశోధనలో తెలంగాణ గిరిజన ప్రాంతాల్లో వినియోగిస్తున్న సంప్రదాయ ఔషధ పద్ధతుల శాస్త్రీయ ధ్రువీకరణతోపాటు హెచ్ఐవీ వంటి వైరస్‌లపై ప్రభావంతమైన ఔషధ అణువులను వాటి నుంచి గుర్తించారు. 2024లో పరిశోధన పూర్తిచేసిన స్వప్న ఆ ఏడాదిలో పరిశోధన అంశంపై భారత పేటెంట్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోగా ఇటీవల స్వప్నకు పేటెంట్ మంజూరు అయింది.

కిట్స్ అధ్యాపకురాలికి డాక్టరేట్



హసన్‌పర్తి: కిట్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న స్వప్న సాతురి హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. డీప్ లెర్నింగ్ ఉపయోగించి చాతీ చిత్రాల నుంచి ఊపిరితిత్తుల వ్యాధుల విభజన, వర్గీకరణ అనే అంశంపై డాక్టర్ సంధ్య, మాటూరి వెంకట సుబ్బారావు పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ లభించింది.

ఆయనతో లావాదేవీలు వద్దు

వరంగల్: కొంతకాలం నుంచి అడ్హి సెక్షన్ కార్యవర్గ, చాంబర్ కార్యవర్గ, సర్వసభ్య సమావేశాల తీర్మానాలు, సూచనలను పాటించకుండా చాంబర్ గౌరవ ప్రతిష్ఠలకు భంగం కలిగే విధంగా ప్రవర్తిస్తున్న దిడ్డి కుమారస్వామి (డీకే) చర్యలను నిరోధించడానికి గురువారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు చాంబర్ సభ్యులకు వాట్సప్‌లో మెసేజ్‌లు పెట్టినట్లు తెలిసింది. మార్చి నెలలో జరిగిన సమావేశంలో చాంబర్ సెక్షన్ ప్రతినిధులు 15రోజులు గడువు ఇవ్వాలని డీకేతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయినప్పటికి ఎలాంటి ఫలితం లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు.

పోస్టింగ్‌లో తాత్సారం..!



సహకారం అందిస్తున్న జెడ్పీ సెక్షన్ అధికారులు

- కోరుకున్న చోటుకు వెళ్లేందుకు లాంగ్ లీవులు
- సంఘాల డిమాండ్‌తో ప్రత్యేకాధికారి వద్దకు ఫైల్

జిల్లా పరిషత్ కార్యాలయం

వరంగల్: వరంగల్ జిల్లా పరిషత్ పరిధి మండలాల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నా ఇతర శాఖలో పనిచేసి వచ్చిన ఉద్యోగికి పోస్టింగ్ ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జెడ్పీకి చెందిన ఒక జూనియర్ అసిస్టెంట్ జెడ్పీ కార్యాలయ ఆవరణలో ఉన్న పీఆర్ ములుగు క్యూసీ సబ్ డివిజన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. పీఆర్ ఇంజనీరింగ్‌శాఖలోని ఒక ఏఈ చనిపోవడంతో కారుణ్య నియామకం కింద అతడి కుమారుడికి ఇదే క్యూసీ సబ్ డివిజన్‌లో పోస్టింగ్ ఇస్తూ పీఆర్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తప్పని పరిస్థితుల్లో అక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ జెడ్పీలో ఇతర ప్రాంతంలో పోస్టింగ్ కోసం రిపోర్టు చేశారు. మార్చి రెండోవారంలో రిపోర్ట్ చేసినా ఇప్పటి వరకు పోస్టింగ్ ఇవ్వడం లేదని, ఇందుకు సంబంధిత సెక్షన్ అధికారులు సహకారం అందిస్తున్నారని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ఆరోపిస్తున్నారు.

దొడ్డిదారిన పోస్టింగ్ పొందేందుకు..

జిల్లా పరిషత్ పరిధిలో సాధారణ బదిలీలు లేకపోవడంతో దొడ్డిదారిన కోరుకున్న చోట పోస్టింగ్ పొందేందుకు ఉద్యోగులు లాంగ్ లీవు పెడుతున్నారు. ఏ మండలంలోనైనా ఒక ఉద్యోగి 6 నెలల పాటు సెలవులో ఉంటే సదరు ఉద్యోగిని జెడ్పీకి సరెండర్ చేస్తారు. వరంగల్ మండలం పైడిపల్లి ప్రభుత్వ పాఠశాలలోని జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ విరమణ పొందుతున్న విషయం తెలుసుకున్న చెన్నారావుపేట మండల కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి లాంగ్ లీవు పెట్టినట్లు సమాచారం. ఫిబ్రవరి నెలాఖరున పైడిపల్లి పాఠశాలలోని జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ విరమణ పొందడంతో ఖాళీ ఏర్పడింది. ఈ ఖాళీలో క్యూసీలో పనిచేసిన జూనియర్ అసిస్టెంట్ జాయిన్ అయ్యేందుకు ప్రయత్నాలు చేసినా సంఘం నాయకులు అభ్యంతరం చెప్పారు. ఈస్థానంలోకి లాంగ్‌లీవు పెట్టిన చెన్నారావుపేట నుంచి జెడ్పీకి వచ్చిన ఉద్యోగికి అధికారులు పోస్టింగ్ ఇచ్చారు. ఆశించిన స్థానం భర్తీ కావడంతో జూనియర్ అసిస్టెంట్ చెన్నారావుపేటకు పోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. భూపాలపల్లిలో జూనియర్ అసిస్టెంట్ సతీమణి ఉద్యోగం చేస్తున్నందున అక్కడ ఖాళీగా ఉన్న సబ్ డివిజన్‌లో పోస్టింగ్ తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేయడంలో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. సంఘాల నాయకుల ఒత్తిడితో జూనియర్ అసిస్టెంట్‌కు చెన్నారావుపేటలో పోస్టింగ్ ఇచ్చేందుకు జెడ్పీ అధికారులు ఫైల్ సిద్ధం చేసి జెడ్పీ ప్రత్యేక అధికారి, కలెక్టర్ వద్దకు పంపారు. ఈఫైల్‌పై కలెక్టర్ రిమార్క్స్ రాసి తిరిగి జెడ్పీకి వచ్చినట్లు తెలిసింది. కలెక్టర్ ఆమోదించిన వెంటనే జూనియర్ అసిస్టెంట్‌కు పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేస్తామని జెడ్పీ ఎస్టాబ్లిష్‌మెంట్ సూపరింటెండెంట్ తెలిపారు.

జెడ్పీల్లో ఇష్టారాజ్యం..

జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం ముగిసింది. చైర్మన్ల స్థానంలో ప్రత్యేక అధికారులుగా నియమితులైన ఆయా జిల్లాల కలెక్టర్లు జెడ్పీ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఉద్యోగ సంఘాల నాయకులు అంటున్నారు. ఇందువల్ల జెడ్పీల్లో అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా మారిందని ఆరోపిస్తున్నారు. జెడ్పీ నుంచి ఉద్యోగులకు సంబంధించిన ఫైళ్ల ప్రత్యేక అధికారుల ఆమోదం కోసం పంపితే జాప్యం జరుగుతున్నదని, ఈవిషయాలపై ఉద్యోగులకు సమాధానం చెప్పలేక జెడ్పీ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని జిల్లా పరిషత్‌లన్నింటిలో ఈపరిస్థితులు నెలకొన్నట్లు తెలిసింది. ప్రత్యేక అధికారులు జిల్లా పరిషత్‌లపై దృష్టి సారించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం బాధ్యులు, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం బాధ్యులు, పార్ట్‌టైం అధ్యాపకులు కోరారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టబోయే అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో పార్ట్‌టైం అధ్యాపకులను ఇంటర్నల్ అభ్యర్థులుగా గుర్తించి ప్రాధాన్యం కల్పించాలని కోరారు. కాంట్రాక్టు అధ్యాపకులుగా పదోన్నతి కల్పించాలన్నారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ డాక్టర్ నరేందర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ దేవోజీ నాయక్, బాధ్యులు కుమార్, సంజీవ, భాగ్యమ్మ, వినోద, విజయ్‌కుమార్, మోహన్, శ్రీధర్, ప్రవీణ్, సుజాత, రాజేందర్, సుధీర్, సరిత పాల్గొన్నారు.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లా శ్రీనివాస్

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ టెక్నికల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కేయూలో గురువారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమస్యకు పరిష్కారం చూపాలే గాని అణిచివేయడం సరికాదన్నారు. కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను అరెస్టు చేయటం అన్యాయమన్నారు. యూజీసీ స్కేల్‌కు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. సమావేశంలో సాంకేతిక ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రాము, ఉపాధ్యక్షుడు మెట్టు రవి, సంయుక్త కార్యదర్శి రవికుమార్, కోశాధికారి వై.బాబు, బాధ్యులు ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మందిరాల పరిశీలన



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను డీఎంహెచ్ఓ అప్పయ్య గురువారం పరిశీలించారు. ఆరోగ్య కేంద్రాల్లో బీపీ, షుగర్ బాధితులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. వేసవి కాలంలో వచ్చే వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

ఎంపీ కావ్య జన్మదిన వేడుకలు



హన్మకొండ చౌరస్తా: వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తన జన్మదిన వేడుకలను హనుమకొండ కనకదుర్గ కాలనీలోని స్వగృహంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం దివ్యాంగుల మధ్య గురువారం నిరాడంబరంగా జరుపుకున్నారు. దివ్యాంగులతో కలిసి కేక్ చేశారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి



మొక్క నాటుతున్న కల్నల్ రవీంద్రకుమార్

హన్మకొండ అర్బన్: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం విద్యార్థులు కృషి చేయాలని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రవీంద్రకుమార్ రవి సూచించారు. నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్నల్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం యువతను తీవ్రంగా పట్టి పీడిస్తున్న సమస్య డ్రగ్స్ అని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ఎన్‌సీసీ కేడెట్ల పాత్ర కీలకమని వివరించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటి 'సే నో టు డ్రగ్స్' ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మేజర్ రేవతి ప్రభాకరన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అధ్యాపకులు రేణుక, కల్పన, సుజాత, రమేష్, రఫీ, ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్ అవంతి, జూనియర్ ఆఫీసర్ దివ్యశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీల హక్కుల పోరాటానికి మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

- మాజీ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

న్యూశాయంపేట: ప్రజాస్వామ్య పద్ధతిలో, శాంతియుత పోరాటాలు చేస్తూ మైనార్టీలు తమ హక్కుల కోసం పోరాటాలు నిర్వహించాలని, అందుకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ అమెండ్‌మెంట్ యాక్ట్‌కు వ్యతిరేకంగా ముస్లిం యూనిటీ అండ్ డెవలప్‌మెంట్ మూవ్‌మెంట్ గ్రేటర్ వరంగల్ ఆధ్వర్యంలో, సంస్థ అధ్యక్షుడు అబ్దుల్ సుబాన్ అధ్యక్షతన హనుమకొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సాయంత్రం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆల్ ఇండియా పర్సనల్ లా బోర్డు ఆదేశాలు పాటిస్తూ వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో పోరాటాలు చేయడానికి కార్యాచరణ రూపొందించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. సమావేశంలో సంస్థ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖుద్దూస్, మహ్మద్ అలీ జుబేర్, మొయినొద్దీన్, అఫ్జల్ మొహియొద్దీన్, చాంద్‌పాషా, అబ్దుల్ సమద్, మహమూద్, ఖలీల్, అజర్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్, పెట్రోల్ ధరల పెంపుపై రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

హసన్‌పర్తి: పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ధరలు పెంచుతూ సామాన్యులపై భారం మోపుతోందని విమర్శించారు. అదానీ, అంబానీ లాంటి బడా బాబులకు కొమ్ము కాస్తూ దేశ సంపదను వారికి అప్పగిస్తోందని ఆరోపించారు. పెరిగిన ధరలను ఉపసంహరించుకోకుంటే దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పద్మ, సురేందర్, లింగయ్య, పుల్లా అశోక్, ఆనందం, రాజేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఔదార్యం చాటుకున్న స్నేహితులు



ఫిక్స్‌డ్ బాండ్ అందజేస్తున్న స్నేహితులు

కాజీపేట అర్బన్: మృతి చెందిన స్నేహితుడి కుమార్తె పేరిట నగదును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి స్నేహితులు తమ ఔదార్యం చాటుకున్న సంఘటన గురువారం మడికొండలో చోటు చేసుకుంది. మడికొండలో పాఠశాలలో 1997 – 98వ బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల్లో పసునూరి కుమారస్వామి ఫిబ్రవరిలో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు కుమారస్వామి కుమార్తె పేరు మీద రూ.82 వేలను కుమార్తెకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్‌ను గురువారం అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి, రఘుచందర్, రాజన్‌బాబు, విజయ్, వెంకటస్వామి, రాము, యాదగిరి, ఉపేంద్ర చారి, సురేష్, రామకృష్ణ, శ్రీహరి, సత్యనారాయణ, త్రివేణి పాల్గొన్నారు.

24న మంత్ర 2కే25 జాతీయ సదస్సు



సదస్సు వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

హన్మకొండ: హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 24న మంత్ర 2కే25 జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శేషాచలం తెలిపారు. ఈమేరకు కళాశాలలో జాతీయ సదస్సు వాల్‌పోస్టర్లను ప్రిన్సిపాల్‌తో కలిసి కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ సదస్సులో దేశంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎంబీఏ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.రాజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.హరేందర్ రెడ్డి, ఎంబీఏ విభాగం అధిపతి డాక్టర్ ఎస్.మహేందర్ కుమార్, మంత్ర 2కే25 కన్వీనర్ ఎ.రజినికుమార్, ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి రథోత్సవం



రథోత్సవంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయం ఆవరణలోని సీతారామచంద్ర స్వామి రథోత్సవ వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. మెట్టుగుట్ట నుంచి మడికొండ పురవీధుల్లో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించి తిరిగి మెట్టుగుట్టకు చేర్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవాల రాధికారెడ్డి, మునిగాల సరోజన, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, ఆలయ ఏఓ శేష భారతి, సీఐ కిషన్, పల్లవు అర్జున్, రమాదేవి, ఉపేందర్, వెంకటేష్, హన్మంతరావు, అర్చకులు విష్ణువర్ధనాచారి, అభిలాష్‌శర్మ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక పోటీలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కేయూ క్యాంపస్: ఈనెల 17న స్పోర్ట్స్ డే, వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలను పరిపాలన భవనంలోని సెనెట్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల నృత్య పోటీలు అలరించాయి. కార్యక్రమంలో కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, సైన్స్ డీన్ ప్రొఫెసర్ హనుమంతు, లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి, డాక్టర్ కనేజ్‌ఫాతిమా, డాక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు. ఈనెల 17న జరగనున్న కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'పోషణ్' పక్షోత్సవాలు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ అధికారి రాజమణి

ఖిలా వరంగల్: పోషణ పక్షోత్సవాల సందర్భంగా వరంగల్ 33వ డివిజన్ రైల్వేగేట్ పెరకవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెరుమాండ్ల ఆశాదేవి ఆధ్వర్యంలో పోషణ సంబురాలు గురువారం జరిగాయి. ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ అధికారి రాజమణి హాజరై పోషణ పక్షం ఉత్సవాలను ప్రారంభించి చిన్నపిల్లల తల్లులు, గర్భిణులతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం చిన్నారులకు ఆమె అక్షరాభ్యాసం చేయించారు. టీచర్లు భవాని, భాగ్యలక్ష్మి, సుజాత, ఆయాలు సులోచన, కవిత, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

గ్రామీణ మహిళలకు రుతుమతి అభియాన్

కేయూ క్యాంపస్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల సురక్షితమైన ఆరోగ్యం కోసం రుతుమతి అభియాన్ కార్యక్రమాన్ని ఏబీవీపీ రూపొందించిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో పద్మాక్షి మహిళా హాస్టల్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పూజ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రుతుమతి అభియాన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూజ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు నెలసరి సమయంలో పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈక్రమంలో విద్యార్థినుల నుంచి సేఫ్టీ ప్యాడ్లు సేకరించి గ్రామీణ ప్రాంత మహిళలకు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ కేయూ ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, అధ్యక్షుడు మెరుగు సాయి, బాధ్యులు డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్, గట్టు ప్రశాంత్, సాయిప్రియ, ఎలేంద్ర, ఫణీంద్ర పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

ఖిలా వరంగల్: రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని, ఈక్రమంలో యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సూచించారు. వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో జీఆర్‌కే యువసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా రవికుమార్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఒక రక్తపు చుక్క నిండు ప్రాణాన్ని నిలబెడుతుందని వివరించారు. అనంతరం గవిచర్ల క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రవికుమార్ ప్రారంభించారు.

గోశాల పనులు పూర్తి

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ బాపూజీనగర్ వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ ఆవరణలో గోశాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మార్కెట్ అభివృద్ధి కమిటీ, ఆంజనేయ స్వామి దేవాలయ నిర్వాహకులు గోశాల పనులకు ఇటీవల శ్రీకారం చుట్టారు. మార్కెట్‌లో గోశాల కట్టకుండా చూడాలని కొంతమంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు పనులను మున్సిపల్ సిబ్బంది అడ్డుకోవడానికి యత్నించారు. అధికారుల అభ్యంతరాలపై కమిటీ సభ్యులు గట్టిగా నిలదీయడంతో చేసేదేమీలేక మిన్నకుండిపోయారు. స్థానికుల సహకారంతో ఆంజనేయ స్వామి దేవాలయం పక్కన గోశాలను నిర్మించడంలో పాలక మండలి సభ్యులు నిమగ్నమయ్యారు.

భీమ్ దీక్ష ముగింపు సభ పోస్టర్ల ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: రంగారెడ్డి జిల్లాలోని తలకొండపెల్లి మండలంలోని క్రాస్ రోడ్డు వద్ద ఈనెల 13న జరగనున్న భీమ్ దీక్షల విమోచన దినోత్సవ ముగింపు సభను విజయవంతం చేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ కోరారు. ఈమేరకు కేయూ మొదటి గేట్ వద్ద భీమ్ దీక్ష ముగింపు సభ వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ బాధ్యులు రత్నాకర్, సాత్విక్, తానేష్, మహేష్, విజయ్, గణేష్, సురేష్, వినయ్, మోజెస్, సతీష్, రాజేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయాలి

హన్మకొండ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఈనెల 14న హనుమకొండ జిల్లాలో గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని అంబేడ్కర్ ఉత్సవాల కమిటీ చైర్మన్ అంకేశ్వరపు రాంచందర్ రావు, సభ్యులు చుంచు రాజేందర్, బండారి సురేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అంబేడ్కర్ భవన్‌కు చేరుకోనున్నట్లు పేర్కొన్నారు. అక్కడ జరగనున్న జయంతోత్సవాల్లో కలెక్టర్, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారని తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

హసన్‌పర్తి: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు దంపతుల వివాహోత్సవాన్ని పురస్కరించుకుని ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంతంలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, దేవస్థాన కమిటీ అధ్యక్షుడు వెంకటస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కిరణ్, దేవస్థాన ధర్మకర్త సంతోష్, రాజు, సురేష్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, పెద్దమ్మ నర్సింహారాములు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ

కాజీపేట రూరల్: కాజీపేట జీసెస్ ప్రేయర్ హాల్ నిర్వాహకులు గురువారం రాత్రి రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అనాథలు, నిరుపేదలకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీసెస్ ప్రేయర్ హాల్ ఫౌండర్ మరియ దాసు, ప్రెసిడెంట్ సూరయ్య, సెక్రటరీలు కృష్ణఫర్, నితిన్‌రెడ్డి, పాస్టర్లు మత్తయి, ఎస్.కొర్నెలు, డి.శ్రీను పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభకు తరలిరావాలి

కాజీపేట అర్బన్: ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో రాంపూర్ కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమంలో రాంపూర్ డివిజన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. ఆలస్యంగా వెలుగులోకి..

ఖిలా వరంగల్: విశ్వనాథ కాలనీలో ఈనెల 1న అర్ధరాత్రి అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి జన్మదిన వేడుకలు జరుగుతున్న సమయంలో కారులో అటువైపు వెళ్తున్న ఓ కారు డ్రైవర్‌పై కొంతమంది వ్యక్తులు దాడి చేశారు. దాంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం కథనం ప్రకారం వరంగల్ శంభునిపేట ప్రాంతానికి చెందిన ఖాసీం ఈనెల 1న అర్ధరాత్రి విశ్వనాథ కాలనీలోని తన అక్క ఇంటికి కారులో వెళ్తుండగా వేడుకల్లో పాల్గొన్న కొంతమంది మద్యం మత్తులో అతడిపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.